సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం, 9, ఆగస్టు, 2023



కల నెరవేరింది

ఎల్లారెడ్డిపేట ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. ఉన్నత విద్య కోసం ఏళ్లుగా ఎదురుచూసిన పేద విద్యార్థులకు డిగ్రీ విద్య దరి చేరింది. 8లో▸



సమయం లేదు మిత్రమా..!

ఎన్నికల సీజన్ వేళ రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు చేరవయ్యేందుకు ప్రజాకర్ష పథకాలను అమలు చేస్తోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. జిల్లాలో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మద్యం దుకాణాలకు 132 దరఖాస్తులు

సిరిసిల్లక్రైం: జిల్లాలో 48 మద్యం షాపులకు ఈ నెల 4 నుంచి ఇప్పటి వరకు 132 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా అబ్కారీ అధికారి పంచాక్షరి మంగళవారం తెలిపారు. దరఖాస్తులు రోజురోజుకు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ కేటగిరీలో కేటాయించిన షాపులకు ఇప్పటి వరకు ఎవరు దరఖాస్తు చేయలేదని వివరించారు. సిరిసిల్ల పట్టణంలోని మొదటి రెండు దుకాణాలకు అత్యధికంగా మంగళవారం ఒక్క రోజు 26 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తుదారులు వారి సందేహాలను నివృత్తి చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. ఈ నెల 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాల సర్వే



విలాసాగర్‌లో కేంద్రబృందం సభ్యులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని విలాసాగర్, మల్లాపూర్ గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సభ్యులు సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, పరిశుభ్రత ఎలా ఉందో పరిశీలించారు. డంపింగ్ యార్డుల వినియోగం, తడి, పొడి చెత్త వేరు చేస్తున్నారా, ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందుతుందా, గ్రామపంచాయతీ రికార్డులు, తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేలో బృందం సభ్యులు శ్రీనివాస్, ప్రవళిక, వినీత, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, అడిషనల్ డీఆర్డీఓ మదన్‌మోహన్, సర్పంచులు జూలపల్లి స్వప్నాంజలి, ఇల్లెందుల శంకరయ్య, ఎంపీడీఓ నల్లా రాజేందర్‌రెడ్డి, ఎంపీఓ గంగాతిలక్, ఎస్బీఎం సురేశ్, గిన్నె రవీందర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బీడీలు చుడుతూ నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గత 34 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేటలో మంగళవారం పంచాయతీ కార్మికులు బీడీలు చుడుతూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రేసు రాజయ్య మాట్లాడుతూ, కార్మికులకు ఇప్పటికే రూ.9,500 వేతనాలు చెల్లిస్తున్నామని మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో పేర్కొనడం బాధాకరమన్నారు. కార్మికులను చిన్నచూపు చూడకుండా వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. నిరసనలో సీఐటీయూ మండలాధ్యక్షుడు జక్కుల మహేందర్, ఉపాధ్యక్షుడు రాందాస్, నర్సయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కార్మికులు ఆంజనేయులు, రాజు, రామకృష్ణ, దేవేందర్, లక్ష్మి, సాయి, శంకర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తు గడువు పెంచాలి



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లఅర్బన్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. మంగళవారం పట్టణంలోని కార్మిక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దరఖాస్తుకు కేవలం మూడు రోజులు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. పథకానికి సబంధించి విధివిధానాలు తెలియక అయోమయంలో ఉన్నారరి పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి మరో పదిరోజుల వరకు గడువు పెంచాలన్నారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి పంతం రవి, రమేష్, నాగరాజు, అజ్జవేణు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం

వీర్నపల్లి(సిరిసిల్ల): తొలిమెట్టులో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం, ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్ట్‌లపై ఆరు రోజులుగా కొనసాగుతున్న శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈఓ రఘుపతి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలు, మెలకువలు అందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రవి, డీఆర్పీలు రామ్‌నాథ్‌రెడ్డి, రవి, నరేష్, మండల ఆర్పీలు అరవింద్, రమాకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత పరిశ్రమలు స్థాపించాలి

- మౌలిక వసతులు కల్పిస్తాం
- గుడిసెలు లేని సిరిసిల్ల కావాలి
- పార్టీలకు అతీతంగా అర్హులకు ఇళ్లు
- కార్మిక వాడల్లో పట్టాల క్రమబద్ధీకరణ
- సమీక్షలో మంత్రి కేటీఆర్



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: వస్త్రపరిశ్రమలోకి యువత రావాలని, ప్రపంచంతో పోటీ పడే స్థాయికి సిరిసిల్ల వస్త్రపరిశ్రమ చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో అభివృద్ధిపై సమీక్షించారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమ బతుకమ్మ చీరల ఆర్డర్లు, ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లతో కొంత మేరకు కార్మికుల ఆదాయం పెరిగిందన్నారు. టెక్స్‌టైల్ కార్పొరేషన్ సహకారంతో వస్త్రపారిశ్రామిక వేత్తలకు మౌళిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వస్త్రపరిశ్రమకు ప్రసిద్ధి చెందిన బారామతి, తిరుపూర్ ప్రాంతాలను సందర్శించి ఇక్కడ ఆ స్థాయిలో పరిశ్రమలను స్థాపించాలని మంత్రి కోరారు. ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని, మరింత మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమలు స్థాపించాలన్నారు.

గుడిసె రహిత సిరిసిల్ల కావాలి

గుడిసె రహిత సిరిసిల్ల కావాలని, అర్హులకు గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో టీమ్ వర్క్ చేసి అర్హులకు ఇళ్లు అందించాలని కోరారు. సిరిసిల్లలో 2,800 మందికి గాను 2,000 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చామని, ఇంకా మిగిలిపోయిన 800 మందికి గృహలక్ష్మిలో ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. గుడిసెలో నివాసం ఉండేవారికి.. ఈ పార్టీ, ఆ పార్టీ అని చూడకుండా.. పేదరికమే గీటురాయిగా సంతృప్త స్థాయిలో ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. 40 రోజుల్లో రుణమాఫీ పూర్తి అవుతుందని వివరించారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్, సుందరయ్యనగర్‌లో 4,200 మందికి పట్టాలను క్రమబద్ధీకరిస్తామని, రిజిస్ట్రేషన్లు చేసుకునేలా, బ్యాంకు రుణాలు అందేలా హక్కులు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఇందు కోసం ఈ నెల 15లోగా జీవో జారీ చేస్తామని వెల్లడించారు. పట్టణంలో గుంట భూమి లేని దళితులకు దళితబంధు మంజూరు చేస్తామని, లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు.

వరద ముంపు లేకుండా ప్రణాళిక

సిరిసిల్ల పట్టణానికి వరద ముంపు లేకుండా శాశ్వత ప్రణాళిక రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఈఎన్‌సీతో క్షేత్రస్థాయి అధ్యయనం చేసి డిజైన్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళాచక్రపాణి, రామతీర్థం మాధవి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధుల కొరత లేదు

- బతుకమ్మ పండుగలోగా గుడి చెరువు, బండ్ పూర్తి చేయండి
- అధికారులకు మంత్రి కేటీఆర్ ఆదేశం

వేములవాడ: వేములవాడను వెన్నెలవాడగా మార్చేందుకు రాజన్న గుడి చెరువును సుందరీకరించాలని, ఘాట్లు ఏర్పాటు చేసి బతుకమ్మ పండుగలోగా పనులు పూర్తి చేయాలని మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మంత్రి.. ఎమ్మెల్యే రమేశ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కలెక్టర్ అనురాగ్ జయంతి, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రూ.1.14 కోట్ల వీటీడీఏ నిధులతో నిర్మించిన నందికమాన్, చింతల్‌ఠాణా పక్కనే నిర్మించిన 42 డబుల్ బెడ్రూంలు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్, డీఈఐసీ, మాతృసేవా సెంటర్లు, రాజన్న గోశాల ఆవరణలో రూ.31 లక్షలతో నిర్మించిన బయోగ్యాస్ ప్లాంట్, మూలవాగు ఒడ్డున రూ.1.98 కోట్లతో ఏర్పాటు చేసిన పార్క్, వాకింగ్ ట్రాక్, రూ.2.50 కోట్లతో శ్యామకుంటలో నిర్మించిన వెజ్ మార్కెట్, మహాలక్ష్మి వీధిలో భగీరథ పనులు ప్రారంభించారు. బద్దిపోచమ్మ ఆలయం వద్ద బోనాల మంటపం, వసతి గదుల పనులకు భూమిపూజ చేశారు. నిధుల కొరత లేదని, మూడు షిఫ్ట్‌ల్లో పనులు పూర్తి చేయాలన్నారు. ఆర్డీవో మధుసూదన్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు. కాగా మంత్రి కేటీఆర్‌కు రాజన్న ఆలయ ఉద్యోగులు చంద్రశేఖర్, శ్రీరాములు, ఎడ్ల శివ స్వామివారి ప్రసాదం అందజేశారు.



వేములవాడ నంది కమాన్



గుడి చెరువు వద్ద పూజలు చేస్తున్న మంత్రి కేటీఆర్



వైద్య శిబిరంతో మాతృసేవా సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి



డబుల్‌బెడ్రూం ఇంటి పట్టా అందజేస్తున్న మంత్రి



భగీరథ నీటిని తాగుతున్న మంత్రి

హైదరాబాద్ రండి



బాధితులతో మాట్లాడుతున్న కేటీఆర్


వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చీర్లవంచకు చెందిన పసుల పద్మ–సురేశ్ దంపతులకు 12 ఏళ్ల కుమారుడు నిరంజన్ ఉన్నాడు. బాలుడికి ఐదేళ్ల క్రితం రెండు కిడ్నీలు పనిచేయక అనారోగ్యం బారినపడ్డాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యానికి డబ్బులు లేక ఇబ్బందులుపడుతున్నారు. ఈక్రమంలో మంత్రి కేటీఆర్‌ను వేములవాడ ఏరియా ఆసుపత్రిలో బాలుడితో పాటు తల్లిదండ్రులు కలిశారు. నిరంజన్‌ను చూసి చలించిన మంత్రి రేపు ఉదయం హైదరాబాద్ రావాలని అక్కడ పెద్ద ఆసుపత్రిలో మాట్లాడి వైద్యం అందిస్తామని బాధితులకు తెలిపారు. అలాగే రవాణా ఖర్చులకు రూ.3 వేలు అందించారు.

ఇంటి తాళం ఇప్పించండి సారూ..



గోడు వెళ్లబోసుకుంటున్న రాజేశ్వరి

సిరిసిల్లటౌన్: వరదలొస్తున్నాయని మున్సిపాలిటోల్లు వచ్చి పదిరోజుల కింద ఎల్లగొట్టింద్రు సారూ.. ఇంకా నా ఇంట్లోకి పోనిస్తలేరు.. అంటూ సర్దార్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు బుర్ర రాజేశ్వరి మంత్రికి గోడు వెళ్లబోసుకుంది. తన ఇంటి తాళం చేతులు ఇప్పించండి' అంటూ ప్రాధేయపడగా, అవ్వ సమస్యను పరిష్కరించాలని అధికారులను కేటీఆర్ ఆదేశించారు. కాగా మంత్రి కేటీఆర్ పర్యటనలో భాగంగా తోపులాటలు, వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. కలెక్టరేట్ మీటింగ్ హాల్ నుంచి మంత్రి వెళ్లే క్రమంలో పోలీసులు అడ్డుతప్పుకోవాలనడంతో ఆగ్రహించిన కార్యకర్తలు, తదితరులు వాగ్వాదానికి దిగడం విశేషం. చివరకు మంత్రి పీఏ తిరుపతి, గణరాజు వచ్చి వారించారు.



కన్నారం నుంచే జైత్రయాత్ర!





"పాత కరీంనగర్.. ఉద్యమాల ఖిల్లా. తెలంగాణ ఉద్యమానికి సమరశంఖం పూరించిన జిల్లా.. ఇక్కడే పార్టీ పునాదులు నిర్మితమయ్యాయి, ఇక్కడ నుంచే తెలంగాణ గళం ఢిల్లీకి వినిపించింది. రెండుసార్లు గులాబీ పార్టీ అధికారంలోకి రావడంలో కరీంనగర్ పాత్ర మరువలేనిది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 12 చొప్పున అసెంబ్లీ సీట్లు గెలుచుకున్నాం. ఈసారి 13 స్థానాలు గెలిచి చరిత్ర సృష్టించాలి. జిల్లాలో పార్టీ గ్రాఫ్ బాగుంది. అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉన్నాం. చేసిన పని ప్రజలకు వివరించండి. ఉద్యమ స్ఫూర్తితో ముందుకుపోదాం. ఎన్నికల జైత్రయాత్ర కరీంనగర్ నుంచే మొదలుపెడదాం. అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరాలన్నది సీఎం అభిలాష. ఇది పెద్ద కష్టమేమీ కాదు"

– బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు ఉమ్మడి జిల్లా నేతలతో హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో చేసిన దిశానిర్దేశం

- 13 స్థానాలు కైవసం చేసుకోవాలె
- గత తప్పిదాలు పునరావృతం కావొద్దు
- ఉమ్మడి జిల్లా గులాబీ లీడర్లకు కేటీఆర్ దిశానిర్దేశం
- గంగుల, హరీశ్, వినోద్, భానుప్రసాద్‌కు అదనపు బాధ్యతలు
- పెద్దపల్లి జిల్లాపై స్పెషల్ ఫోకస్ పెట్టిన అధిష్టానం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. దాదాపుగా చివరి అసెంబ్లీ సమావేశాలు కావడంతో మంత్రి గంగుల కమలాకర్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు హైదరాబాద్‌లో విందు ఏర్పాటు చేశారు. కొంతకాలంగా చొప్పదండి, రామగుండం ప్రాంతాల్లో నేతలు తిరుగుబాటుకు సిద్ధమవుతున్న వేళ ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. పాత కరీంనగర్ జిల్లాకే చెందిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ స్థితిగతులకు సంబంధించిన పూర్తి సమాచారం తన వద్ద ఉందని... ఎప్పటికపుడు తనకు పార్టీ గ్రాఫ్‌పై నివేదికలు అందుతున్నాయని మంత్రి కేటీఆర్ వారితో అన్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఇంతకాలం ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ "మూడు గంటల కరెంటు" వ్యాఖ్యలతో విశ్వసనీయత కోల్పోయిందని... బీసీ బంధు, గృహలక్ష్మి, మైనార్టీ బంధు, విద్యా కానుక వంటి పథకాలతో ప్రజల్లో పార్టీ గ్రాఫ్ మరింత పెరిగిందని వివరించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నచోట అందరికీ సానుకూలంగానే ఉందని ప్రశంసించినట్లు తెలిసింది. ఉత్తర తెలంగాణకు గుండెకాయ అయిన పాత కరీంనగర్ జిల్లాలో ఈసారి ఎలాగైనా 13 స్థానాలు గెలవాలని.. ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయొద్దని స్పష్టం చేశారు.

నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలు..

హైదరాబాద్‌లో మంగళవారం మరో కీలక సమావేశం జరిగింది. ప్రతికూల అంశాలు పార్టీ విజయావకాశాలను ఏమాత్రం ప్రభావం చూపకుండా ఉండాలని పార్టీ నిర్ణయించింది. పార్టీలో మెరుగైన గ్రాఫ్ ఉన్న నాయకులను ఇతర నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలుగా నియమించారు. కరీంనగర్‌లో బలమైన అభ్యర్థిగా ఉన్న గంగుల కమలాకర్ (62శాతం గ్రాఫ్)కు అదనంగా చొప్పదండి నియోజకవర్గం అప్పగించారు. మానకొండూరు బాధ్యతలను ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌కు ఇచ్చారు. కీలకమైన హుస్నాబాద్ అసెంబ్లీకి మంత్రి హరీశ్‌రావు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు అభ్యర్థుల బాధ్యతలను ఎమ్మెల్సీ భానుప్రసాద్‌కు అప్పగించారు. జగిత్యాల జిల్లా బాధ్యతలను మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ చూస్తారని తెలిసింది.

పెద్దపల్లి జిల్లాపై స్పెషల్ ఫోకస్..

2018 అసెంబ్లీ ఎన్నికల్లో పాత జిల్లాలోని కరీంనగర్‌లో ఐదు(తర్వాతి కాలంలో హుజూరాబాద్ బీజేపీ వశమైంది), సిరిసిల్లలో రెండు, జగిత్యాలలో మూడుస్థానాలను బీఆర్‌ఎస్ క్లీన్‌స్వీప్ చేసింది. కానీ... పెద్దపల్లిలో మాత్రం సీన్ రివర్స్ అయింది. అక్కడ మూడుస్థానాలకు ఒకటే గులాబీ పార్టీ గెలుచుకుంది. మంథనిలో శ్రీధర్ బాబు(కాంగ్రెస్), రామగుండంలో కోరుకంటి చందర్(ఏఐఎఫ్‌బీ)లు విజయం సాధించారు. వెంటనే కోరుకంటి చందర్ గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పుడు కూడా పెద్దపల్లి జిల్లాలో మూడుస్థానాల్లో కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిపై రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతుందన్న సమాచారంతో.. ఆ లోటును పూడ్చేందుకు ఎమ్మెల్సీ భానుప్రసాద్‌కు పార్టీ పెద్దపల్లి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

కార్మికులు యజమానులయ్యేదెప్పుడు

- సిరిసిల్లలో పవర్‌లూం కార్మికుల నిరసన యాత్ర



నిరసన తెలుపుతున్న పవర్‌లూం కార్మికులు

సిరిసిల్లటౌన్: ఎన్నికలు వస్తున్నయ్.. పోతున్నయ్.. సర్కారు మాత్రం సిరిసిల్ల నేత కార్మికులను యజమానులు చేస్తామన్న మాట అమలు కావడం లేదని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ విమర్శించారు. సిరిసిల్లలో వెంటనే వర్కర్ టూ ఓనర్ పథకం అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన యాత్ర చేపట్టి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించి మాట్లాడారు. పదేళ్లుగా వర్కర్ టూ ఓనర్ పథకం ప్రారంభంలో సర్కారు ఎందుకు జాప్యం చేస్తుందని ప్రశ్నించారు. పెద్దూరు సమీపంలో 88 ఎకరాల స్థలం కేటాయించగా సీఎం కేసీఆర్ 2019లో శంకుస్థాపన చేశారని, మొదటి విడతగా 1,104 మంది కార్మికులకు పథకం ద్వారా యజమానులు చేస్తామని చెప్పి, ఇదివరకు వర్క్ షెడ్ల నిర్మాణ జరగలేదన్నారు. ఇప్పటికైనా మంత్రి కేటీఆర్ స్పందించి కార్మికులకు ఇచ్చిన మాట వెంటనే నిలబెట్టుకుని చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోడం రమణ, శ్రీరాం సదానందం, సూరం పద్మ, నక్క దేవదాసు, సిరిమల్ల సత్యం, గుండు రమేశ్, రవి, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'కు స్పందన

సిరిసిల్లటౌన్: రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహిస్తున్నట్లు డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాములు మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యారోగ్య శాఖ చేపట్టిన ×ఆరోగ్య మహిళ¥ శిబిరానికి మంచి స్పందన వస్తుందన్నారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీఎసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యారోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన శిబిరాల్లో ఓపీడీ 397, బ్రెస్ట్ 396, ఓరల్ కావిటీ 396 పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ 10, ల్యాబ్ 71, థైరాయిడ్ 52, విటమిన్ డీ 33, సీబీపీ 60, సూక్ష్మ పోషకాలు 60 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో 8 మందిని జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



మల్లయ్యను పరామర్శిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన కనకట్ల ఎల్లయ్య అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లయ్య కుటుంబ సభ్యులతోపాటు అదే గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త కనకట్ల మల్లయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా రెండు కుటుంబాల సభ్యులను మంగళవారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ, మల్లయ్యకు వైద్యపరంగా, మృతుడు ఎల్లయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, నాయకులు అందె సుభాష్, సుధాకర్‌రావు, తిరుపతి, రఘురాములు ఉన్నారు.

పొరపాటెక్కడ..?

- ఎస్ఐ ఫలితాల్లో ఇద్దరు అభ్యర్థుల అయోమయం

వేములవాడరూరల్: కష్టపడి ఎస్ఐ ఉద్యోగం సాధించాలని ఆ అభ్యర్థులిద్దరూ పోటీ పడి పరీక్షలు రాశారు. పొరపాటు ఎక్కడ జరిగిందో ఏమో కానీ ఫలితాల్లో ఒకరికి బదులు మరొకరి పేరు రావడంతో వారి కుటుంబాల్లో ఆందోళన మొదలైంది. వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట గ్రామానికి చెందిన విక్కుర్తి శిరీష ఎస్ఐ ఫలితాల్లో ఆమెకు బదులు కామారెడ్డి జిల్లాకు చెందిన పవర్ శిరీష పేరు వచ్చినట్లు తెలిసింది. దీంతో ఆందోళన చెందిన విక్కుర్తి శిరీష ఫలితాలపై ఆరా తీసింది. ఈ విషయమై ఆమె మంగళవారం హైదరాబాద్ వెళ్లి ఫలితాలపై సంబంధిత అధికారులను అడుగగా, బుధవారం వరకు పూర్తి సమాచారం అందిస్తామని చెప్పినట్లు తెలిసింది.

గుండెపోటుతో పొలంలోనే రైతు మృతి



రమేశ్‌రెడ్డి మృతదేహం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులో మంగళవారం ఓ రైతు గుండెపోటుతో పొలంలోనే పడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బోకూరి రమేశ్‌రెడ్డి(45) మంగళవారం పొలం దున్నేందుకు ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. విద్యుత్ మోటారు ఆన్ చేసేందుకు ఒడ్డుపై నుంచి నడిచివెళ్తున్నక్రమంలో ఆకస్మికంగా గుండెపోటు రావడంతో పొలంలోనే పడిపోయాడు. వెంటనే సమీపంలో ఉన్న తండ్రి చంద్రారెడ్డి వచ్చి పరిశీలించగా మృతిచెందాడు. సమాచారం అందుకున్న భార్య సుజాత అక్కడికి వచ్చి భర్త మృతదేహంపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అనంతరం స్థానికుల సాయంతో రమేశ్‌రెడ్డి మృతదేహాన్ని పొలంలోనుంచి ఇంటికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి కొడుకు ప్రశాంత్, కూతురు లహరి ఉన్నారు.

సమయం లేదు మిత్రమా..!

- గృహలక్ష్మి, మైనార్టీబంధుకు సమీపించిన గడువు
- అర్హతలు కలిగిన వారు ఆగమాగం
- దరఖాస్తుదారులతో కార్యాలయాలు కిటకిట
- గడువు పెంచాలంటున్న జిల్లావాసులు
- మైనార్టీబంధుకు వచ్చిన దరఖాస్తులు 58

నియోజకవర్గాల వారీగా గృహలక్ష్మికి వచ్చిన దరఖాస్తులు

కరీంనగర్	78
పెద్దపల్లి	1652
జగిత్యాల	274
సిరిసిల్ల	3495
మానకొండూరు	10
మంథని	617
హుజూరాబాద్	186
కోరుట్ల	766
వేములవాడ	2329
ధర్మపురి	566
చొప్పదండి	30
రామగుండం	1900



పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తుదారులు

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల సీజన్ వేళ రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు చేరవయ్యేందుకు ప్రజాకర్ష పథకాలను అమలు చేస్తోంది. ఇప్పటికే దళితబంధు, బీసీలకు రూ.లక్ష సాయం ప్రకటించగా.. తాజాగా గృహలక్ష్మీ పేరుతో నిరుపేదలకు గృహయోగం కల్పించేలా.. మైనార్టీబంధుతో ముస్లిం, క్రిస్టియన్ వర్గాలవారికీ ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. వంద శాతం సబ్సిడీతో మూడు విడుతల్లో సొంత స్థలం ఉన్న వారు ఇళ్లు నిర్మించుకోవచ్చు. అదే మైనార్టీబంధులో వన్‌టైం గ్రాంట్ కింద కుటుంబంలో ఒకరికి రూ.లక్ష అందించనున్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధిపొందేందుకు అర్హులు అన్నిరకాల ప్రయత్నాలూ చేస్తున్నారు. వీరి అవకాశాన్ని మీసేవ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. అధిక చార్జీలు తీసుకుంటూ వారి వెన్ను విరుస్తున్నారు. ఈ రెండు పథకాలకు దరఖాస్తు గడువు దగ్గరపడుతుండటంతో దరఖాస్తుదారులు సమయంలేదని అధిక చార్జీలైనా చెల్లిస్తున్నారు.

గృహలక్ష్మి నిబంధనలు

- ఇళ్లు లేకుండా సొంత జాగా ఉండి నిర్మాణం చేసుకునేవారు
- స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు
- తెల్ల రేషన్‌కార్డు కచ్చితంగా కలిగివుండాలి
- కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసు బుక్ జిరాక్స్‌లు జతపర్చాలి
- జీవో 59 కింద లబ్ధిపొందని వారు మాత్రమే అర్హులు

మైనార్టీబంధు నిబంధనలు

- దరఖాస్తుదారులకు వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణాల్లో రూ.రెండు లక్షలకు మించరాదు
- 2023 జూన్ 2వ తేదీ నాటికి 21నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు గలవారై ఉండాలి
- తహసీల్దార్ జారీచేసిన బీసీ సీ, చర్చి పాస్టర్ మంజూరు చేసిన బాప్టిస్ట్ సర్టిఫికెట్ తప్పనిసరి
- ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారు
- కులం, ఆదాయం, నివాసం ధ్రువప్రతాలు తప్పనిసరి
- మంత్రి ఆమోదంతో జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ ఎంపిక చేసి మైనార్టీశాఖ ద్వారా అందిస్తారు.

గృహలక్ష్మికి రేపటితో.. మైనార్టీబంధు 14 వరకు గడువు

గూడు నిర్మించుకోవాలని ఎన్నో రోజులుగా ఆశగా ఎదురుచూస్తున్న వారికి ఈ నెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటన జారీ చేశారు. దీంతో వివిధ ప్రాంతాల్లో పనుల కోసం వెళ్లినవారు, స్థానికంగా ఉంటున్న వారు ఆయా పత్రాలు సమకూర్చుకోవడానికి పరుగులు పెడుతున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు కాకుండా కలెక్టరేట్, మున్సిపాలిటీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తులు నేరుగా అందించాలనడంపై దరఖాస్తుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మైనార్టీబంధుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 14వరకు గడువు ఇచ్చారు. దాని గడువు మరో ఐదు రోజులే ఉండటంతో మైనార్టీలు ఆందోళన చెందుతున్నారు. సరైన సమాచారం లేక ఎవరు ఏం చెబితే వాటికోసం పరుగులు తీస్తూ ఆగమాగం అవుతున్నారు. మీసేవ కేంద్రాల్లో కులం, ఆదాయం, తదితర సర్టిఫికెట్ల కోసం బారులు తీరుతున్నారు. మద్యం దుకాణాల్లో టెండర్లు వేయడానికి కులం సర్టిఫికెట్ అవసరం కావడంతో వారు కూడా పరుగున వస్తుండటంతో రద్దీ పెరుగుతోంది. ఇదే అదనుగా మీసేవ కేంద్రాల నిర్వాహకులు అధికచార్జీలు వసూలు చేస్తున్నారు.

కల నెరవేరింది



మంత్రి కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

- ఎల్లారెడ్డిపేటకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మంజూరు
- హర్షం వ్యక్తం చేసిన విద్యార్థి సంఘాలు
- జూనియర్ కాలేజీ భవనాన్ని పరిశీలించిన అగ్రహారం ప్రిన్సిపాల్
- ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రవేశాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. ఉన్నత విద్య కోసం ఏళ్లుగా ఎదురుచూసిన పేద విద్యార్థులకు డిగ్రీ విద్య దరి చేరింది. విద్యార్థి సంఘాల పోరాటాలు, అధికార పార్టీ నాయకుల ప్రయత్నాలు ఫలించాయి. దూరప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక ఉన్నత విద్యకు దూరమైన బాలికలు, గల్ఫ్‌బాట పట్టిన యువకుల కుటుంబాల్లో కళాశాల మంజూరు వార్తతో ఆనందం వెల్లివెరిసింది.

ఈ సంవత్సరం నుంచే ప్రవేశాలు

ఎల్లారెడ్డిపేటకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మంజూరైనట్లు జీవో కాపీని అగ్రహారం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ మంగళవారం స్థానిక జూనియర్ కాలేజీ అధ్యాపకులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేస్తూ జీవో నంబర్ 57ను ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి నూతన అడ్మిషన్లు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. బీఏ (ఇంగ్లిష్), బీకామ్ (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ(బీజెడ్సీ), బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్) కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. ప్రతీ కోర్సులో 60 సీట్లు ఉంటాయని చెప్పారు. స్థానిక జూనియర్ కాలేజీ భవనంలోనే తరగతులు ప్రారంభిస్తామన్నారు.

ఫలించిన విద్యార్థి సంఘాల పోరాటాలు

డిగ్రీ కాలేజీ కోసం రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలోని వివిధ విద్యార్థి సంఘాలు అలుపెరగని పోరాటాలు చేశాయి. మంత్రి కేటీఆర్ ఈ ప్రాంతంలో పర్యటించిన ప్రతీసారి ఆయన కాన్వాయ్‌ని అడ్డుకోవడం, పోలీసులు అరెస్టులు చేయడం పరిపాటిగా మారింది. అనేక సందర్భాల్లో విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడంతోపాటు కేసులు పెట్టి జైలుకు పంపారు. జూనియర్ కాలేజీ విద్యార్థులు అనేకసార్లు తరగతులను బహిష్కరించి రోడ్డెక్కారు. ఏబీవీపీ నాయకులు సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డుల ద్వారా డిగ్రీ కాలేజీని మంజూరు చేయాలని విన్నవించారు. ఎస్ఎఫ్ఐ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు రాస్తారోకోలు, ధర్నాలతో ఆందోళనలు చేపట్టారు. చివరకు స్థానిక అధికార పార్టీ నాయకులు సైతం డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్‌కు విన్నవించారు. సమష్టి పోరాటాలతోనే మారుమూల ప్రాంతానికి డిగ్రీ కళాశాల ఎట్టకేలకు మంజూరైంది.

మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

డిగ్రీ కాలేజీ మంజూరుకు కృషి చేసిన మంత్రి కేటీఆర్ చిత్రపటానికి జూనియర్ కాలేజీ విద్యార్థులు క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ నాయకులు పాత బస్టాండ్‌లో టపాసులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ లక్ష్మణరావు, ఎంపీపీ పిల్లి రేణుక మాట్లాడుతూ, కళాశాల మంజూరుతో ఉమ్మడి మండలాల విద్యార్థుల చిరకాల కల నెరవేరిందన్నారు. ఈ ప్రాంత అమ్మాయిలు ఇక నుంచి ఉన్నత విద్యకు దూరం కాకుండా డిగ్రీ కోర్సులలో చేరే అవకాశం మంత్రి కేటీఆర్ కల్పించారని పేర్కొన్నారు. ప్రస్తుతం జూనియర్ కాలేజీ భవనంలో తరగతులు ప్రారంభిస్తుండగా, భవిష్యత్‌లో మంత్రి కేటీఆర్ సహకారంతో పక్కా భవనాన్ని నిర్మించుకోవడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్‌కుమార్, పట్టణాధ్యక్షుడు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ కోసం జైలుకెళ్లినా..



ఎల్లారెడ్డిపేటలో డిగ్రీ కాలేజీ లేక ఉన్నత విద్య కు ఈ ప్రాంత విద్యార్థులు దూరం కావడం బాధాకరంగా ఉండేది. విద్యార్థులతో కలిసి అనేక రూపాల్లో ఉద్యమాలు చేశాం. పోలీసులు కేసులు పెట్టి జైలుకు పంపారు. మూడు నెలలు పాటు జైలుజీవితం అనుభవించా. ఎట్టకేలకు కళా శాల మంజూరు కావడం సంతోషంగా ఉంది.

– మారవేని రంజిత్‌కుమార్, ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్

సంతోషంగా ఉంది



ఇన్నాళ్లు డిగ్రీ కాలేజీ లేక మా సీనియర్లు ఉన్నత విద్యకు దూరమయ్యారు. స్థానికంగా కళాశాల మంజూరు చేయడం సంతోషంగా ఉంది. ముఖ్యంగా ఆడపిల్లలు దూరప్రాంతాలకు వెళ్లలేక భవిష్యత్‌ను అంధకారం చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇంతకాలానికి డిగ్రీ కాలేజీ మంజూరైన వార్త విద్యార్థులలో సంతోషాన్ని నింపింది.

– పెంద్యాల శివ, ఇంటర్ విద్యార్థి

మంత్రికి కృతజ్ఞతలు



ఈ ప్రాంత పేద విద్యార్థులు ఇంత కాలం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేక ఉన్నత విద్యకు నోచుకోలేకపోయారు. ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా, తప్పకుండా కాలేజీ మంజూరు చేస్తామని ఏడేళ్ల క్రితమే మాటిచ్చి నిలుపుకున్నారు. మంత్రికి ఈ ప్రాంత ప్రజల తరఫున కృతజ్ఞతలు.

– తోట ఆగయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

- సిరిసిల్లలో మాజీ సర్పంచ్‌ల నిరవధిక దీక్షలు ప్రారంభం



దీక్షలో మాట్లాడుతున్న దేవయ్య

సిరిసిల్లటౌన్: తమ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో నిరవధిక దీక్షలను హైకోర్టు జస్టిస్ చంద్రకుమార్ ప్రారంభించారు. అనంతరం దేవయ్య మాట్లాడుతూ, మాజీ సర్పంచులందరికీ నెలకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని, అర్హులకు డబుల్ బెడ్రూం, హెల్త్‌కార్డులు, బస్‌పాస్‌లు ఇవ్వాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించాలని, సర్పంచులు, మాజీ సర్పంచులు మృతిచెందితే ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించి రూ.5లక్షలు ఆర్థికసాయం చేయాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ భవనాలు కట్టించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. దీక్షల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, సంభనూరి మల్లేశం, జనగామ నర్సింగరావు, గుర్రం భూపతిరెడ్డి, మ్యాకల శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజేశం, గంగస్వామి, సలీం, నారాయణ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే డిగ్రీ కళాశాల

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట ఉమ్మడి మండల విద్యార్థుల చిరకాల కాంక్ష అయిన ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటులో ఎస్ఎఫ్ఐ పోరాటం ఎంతో ఉందని జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదేళ్లుగా అనేక ఉద్యమాలు చేశామన్నారు. దాని ఫలితంగానే దిగివచ్చిన ప్రభుత్వం కళాశాలను మంజూరు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోరాటం ఫలించింది

ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం పదేళ్లుగా ఏబీవీపీ నాయకులు అనేక పోరాటాలు చేశారని, నాయకులపై అక్రమ కేసులు పెట్టినా భయపడకుండా ఉద్యమాలు చేశామని తమ పోరాటాల ఫలితంగానే కళాశాల మంజూరైందని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేటలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు స్థానికంగా డిగ్రీ కాలేజీ లేకపోవడంతో పేద, బడుగు, బలహీనవర్గాల గిరిజన విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ చదువుకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ఏర్పాటుతో వేల మంది విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నారు.

బాలికపై అసభ్య ప్రవర్తన

- ఇద్దరు బాలురపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో ఆదివారం సాయంత్రం బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు బాలురపై కేసు నమోదు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ కుటుంబం ఇటీవల ఆ గ్రామానికి వలస వచ్చింది. ఆదివారం సాయంత్రం బాలిక బయటకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు అసభ్యకరంగా ప్రవర్తించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

పెగడపల్లి(ధర్మపురి): పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామానికి చెందిన నల్ల నర్సమ్మ (75) వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నర్సమ్మ గ్రామశివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. బంధువులు మంగళవారం వృద్ధురాలి కోసం వెతకగా బావిలో శవమై కనిపించింది. మృతురాలి కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

మాటు వేసి.. కత్తితో పొడిచి..

- కోరుట్లలో బీఆర్ఎస్ నేత దారుణ హత్య
- ముసుగులు ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు
- హోటల్‌లో టీ తాగుతుండగా లక్ష్మీరాజంపై దాడి
- తీవ్రగాయాలతో కరీంనగర్ ఆస్పత్రిలో మృతి
- ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన
- పట్టణంలో ఉద్రిక్తత – మోహరించిన పోలీసు బలగాలు



లక్ష్మీరాజం(ఫైల్)



లక్ష్మీరాజం మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

జగిత్యాలక్రైం: మంగళవారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ప్రశాంతంగా ఉన్న కోరుట్ల క్రిస్టియన్ కాంపౌండ్ వాతావరణం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది.. ముసుగులు ధరించి మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు అగంతకులు.. మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు పోగుల లక్ష్మీరాజం(45)పై కత్తితో దాడి చేయడంతో స్థానికులు భయంతో పరుగులు పెట్టారు. దుండగులు ఆయన మెడపై మూడుసార్లు గట్టిగా పొడిచారు.. తీవ్రంగా గాయపడ్డ లక్ష్మీరాజంను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందారు. ఈఘటనతో కోరుట్ల పట్టణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

పథకం ప్రకారమే హత్య..

- పోగులలక్ష్మీరాజం – పోగుల ఉమారాణి దంపతులు.
- బీఆర్ఎస్‌కు చెందిన లక్ష్మీరాజం కౌన్సిలర్‌గా గతంలో సేవలు అందించారు. ఆయన భార్య ప్రస్తుతం తొమ్మిదోవార్డు కౌన్సిలర్‌గా వ్యవహరిస్తున్నారు.
- అయితే, లక్ష్మీరాజం రోజూ ఉదయం 9గంటలకు క్రిస్టియన్ కాంపౌండ్ సమీపంలోని పోగుల శంకర్ హోటల్‌కు వెళ్లి టీ తాగడం, స్థానికులతో ముచ్చటించడం చేస్తున్నారు.
- ఆయన కదలికలను ఇద్దరు దుండగులు కొద్దిరోజులుగా గమనిస్తున్నారు.
- అయితే, టీ తాగి కూర్చున్న లక్ష్మీరాజం వద్దకు మోటార్‌సైకిల్‌పై మాస్క్ పెట్టుకుని వచ్చిన ఇద్దరు 'అన్నా' అని పిలిచారు.
- అతడి దగ్గరకు వెళ్లి వెంటనే కత్తితో మెడపై మూడు సార్లు పొడిచారు.
- దీంతో లక్ష్మీరాజం గట్టిగా కేకలు వేశారు. టీ తాగేందుకు వచ్చిన వారు భయపడి దూరంగా పారిపోయారు.
- ఇదే అదనుగా దుండగులు మోటారు సైకిల్‌పై తప్పించుకుపోయారు.
- తీవ్రంగా గాయపడ్డ లక్ష్మీరాజంను తొలుత స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.
- పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

కోరుట్లలో ఉద్రిక్తత..

లక్ష్మీరాజంపై దాడి విషయం తెలియడంతో కోరుట్లలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మృతుడి బంధువులు, అనుచరులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో కరీంనగర్ నుంచి మృతదేహం కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి పోస్టుమార్టం చేశారు. ఇదేసమయంలో బంధువులు, అనుచరులు ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. హంతకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్ సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. అయిలాపూర్‌లో రోడ్డులోని నివాసానికి మృతదేహాన్ని తీసుకెళ్లారు. భార్య ఉమారాణి బోరున బోరన విలపించగా స్థానికులు కంట తడి పెట్టుకున్నారు. లక్ష్మీరాజంకు కొడుకు, కూతురు ఉన్నారు.

పాత కక్షలేనా?

- లక్ష్మీరాజం హత్యకు పాత కక్షలే కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- ఆర్నెల్ల క్రితం ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ హత్య కేసులో లక్ష్మీరాజం అనుచరులుగా చెబుతున్న వారు పాలుపంచుకున్నారు.
- దీంతో ఆయన హత్య వెనుక లక్ష్మీరాజం హస్తం ఉందని భావించి ప్రవీణ్‌సింగ్ సన్నిహితులు, అన్నదమ్ములైన విత్తనాల నాగరాజు(30), త్రిమూర్తులు(28).. కలిసి పథకం ప్రకారమే పోగుల లక్ష్మీరాజం హత్య చేశారని పోలీసులకు కొన్ని లభించినట్లు సమాచారం. ఈ ఇద్దరికి మల్లాపూర్ ప్రాంతానికి చెందిన పిల్లి సత్యనారాయణ, కోరుట్లకు చెందిన వంశీ సహకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతోపాటు రాజకీయ కక్షలతో ఎవరైనా హత్యకు సుపారీ ఇచ్చారా? అనే సందేహాలూ ఉన్నాయి.

దుండగుల గుర్తింపు..

లక్ష్మీరాజం హత్యలో విత్తనాల నాగరాజు, విత్తనాల త్రిమూర్తులు, పిల్లి సత్యనారాయణ, వంశీ పాలుపంచుకున్నట్లు అనుమానిస్తున్నామని, వారిని పట్టుకునేందుకు ఐదు పోలీసు బృందాలు గాలిస్తున్నాయని డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. నిందితులిద్దరూ మోటారు సైకిల్‌పై పారిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. నిందితులు వాడిన మోటార్‌సైకిల్ వంశీదని సమాచారం. సోమవారం రాత్రి వంశీ నుంచి నిందితులు దానిని తీసుకున్నట్లు తెలిసింది. ఆర్నెల్ల క్రితం హత్యకు గురైన ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ ఈ మోటార్ సైకిల్‌ను వంశీకి ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం విత్తనాల నాగరాజు, వంశీ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. వీరిద్దరూ ఇప్పటికే రెండు, మూడు హత్య కేసుల్లో నిందితులని పోలీసు రికార్డుల్లో ఉంది.

యువకుడి ఆత్మహత్యాయత్నం

హంతకులను కఠినంగా శిక్షించాలని యువకులు కార్గిల్ చౌరస్తా వద్ద సుమారు గంట పాటు రాస్తారోకో చేశారు. ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ కిరణ్‌కుమార్ హంతకులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వటంతో యువకులు ఆందోళన విరమించారు. కాగా, హత్యా స్థలాన్ని ఎస్పీ భాస్కర్ రాత్రి పరిశీలించారు.